క్లుప్తంగా

జోరుగా ఏలేరు గండి పూడ్చివేత పనులు



చివరి దశకు చేరుకున్న గండి పూడ్చివేత పనులు

మాకవరపాలెం : ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని రాచపల్లి వద్ద 99వ కిలోమీటరు ప్రాంతంలో ఏలేరు కాలువకు ఆదివారం ఉదయం గండి పడింది. అదే రోజు సాయంత్రం నుంచి జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. అయితే నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గండి పూడ్చివేతకు ఆటంకం కలిగింది. దీంతో సోమవారం సాయంత్రానికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి ఈ పనులు పూర్తవుతాయని డీఈ కామేశ్వరరావు తెలిపారు. గండి పూడ్చివేత పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం, స్థానిక తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నర్సీపట్నం : ముస్లింలకు అత్యంత పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలు సోమవారం నర్సీపట్నంలో ఘనంగా జరిగాయి. ముస్లింలు నూతన దుస్తులు ధరించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి జామియా మసీదుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఫజర్ నమాజ్ తరువాత శాంతి ర్యాలీ నిర్వహించారు. ఖురాన్ సూక్తులు, భక్తి గీతాలను ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

గొలుగొండ : ఎంపీడీవో కార్యలయంలో మంగళవారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో డేవిడ్‌రాజు తెలిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులంతా హాజరు కావాలని తెలిపారు.

30 నుంచి సమ్మెబాట



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఏరియా ఆస్పత్రి ఒప్పంద కార్మికులు

నర్సీపట్నం : ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య విభాగం ఒప్పంద కార్మికులు సమ్మె బాట పడుతున్నారని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రి ఒప్పంద కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లా కలెక్టర్, పార్లమెంట్, శాసన సభ్యులను కలిసి సమ్మెపై వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో వేతనాలు చెల్లించక కార్మికులు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేసి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన అవసరం



మల్లవరంలో అవగాహన కల్పిస్తున్న రమణ

మాకవరపాలెం: హెచ్ఐవీపై నివారణకు అందరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ డి.రమణ సూచించారు. మండలంలోని ఎం.నగరం, బయ్యవరం గ్రామాల్లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు వివరించారు. అలాగే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా, వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న తాగునీటి పైలట్ ప్రాజెక్టులు

- తాండవలో నీటి ప్రవాహంతో మరమ్మతులు
- గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు



నదిలో నీటి ఉధృతికి పైలట్ ప్రాజెక్టు దెబ్బతినకుండా ఏర్పాట్లు చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు (ఫైల్)



తాండవ నదిలో చిక్కుడుపాలెం వద్ద పైలట్ ప్రాజెక్టును ముంచేలా ప్రవహిస్తున్న నీరు

నాతవరం: తాండవ నది ఉప్పొంగిన స్పిల్ వే గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన తాగునీటి పైలెట్ ప్రాజెక్టులు తరచూ మొరాయిస్తున్నాయి. ప్రజలకు తాగునీరు అందించేందుకు చిక్కుడుపాలెం గుమ్మడిగొండ ప్రాంతాల వద్ద తాండవ నదిలో పైలట్ ప్రాజెక్టులు నిర్మించారు. చిక్కుడుపాలెం వద్ద పైలట్ ప్రాజెక్టు ద్వారా మన్యపురట్ల, రాజుపేట అగ్రహారం, నాయుడుపాలెం, లింగంపేట, ఉప్పరగూడెం, గన్నవరం, వై.బి.పట్నం, ఎ.పి.పురం, వి.బి.అగ్రహారం వై.బి.అగ్రహారం, మాసయ్యపేట, బుచ్చింపేట, కొత్త నాయుడుపాలెం, కేఆర్‌సీ పురం, గొలుగొండపేట తదితర 20 గ్రామాలకు తాగునీరు పైపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. గుమ్మడిగొండ గ్రామం వద్ద తాండవనదిలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్రాజెక్టు ద్వారా నాతవరం పంచాయతీలో ప్రజలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు ఇతర పరిశ్రమలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా రోజుకు 20 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ నదిలో నీరు ఉప్పొంగడంతో నదిలో ఏర్పాటు చేసిన పైలట్ ప్రాజక్టులు తరుచూ సాంకేతిక సమస్య కారణంగా మొరాయించేవి. దీంతో నాతవరం పంచాయతీకి రెండు రోజుల పాటు తాగునీటి సమస్య తలెత్తింది. తాండవ రిజర్వాయరులో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరితే స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తుంటారు. భారీ వర్షాలకు గెడ్డల ద్వారా ఎగువ ప్రాంతాలు నుంచి అధిక మొత్తంలో నదిలోకి నీరు రావడంతో నదిలో ఉన్న పైలట్ ప్రాజెక్టులు మొరాయిస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టులు బాగు చేయాలంటే తాండవ నదిలో పూర్తిగా నీటి ప్రవాహం తగ్గితే గానీ పనులు చేసే పరిస్థితి ఉండదు. ఆసమయంలో పైలట్ ప్రాజెక్టుల నుంచి ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. వీటి మరమ్మతులకు పంచాయతీ నిధులు అధికమొత్తంలో ఖర్చు చేస్తున్నారు.

తరుచూ మరమ్మతులు



తాండవ నదిలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు నుంచి నాతవరం పంచాయతీలో 10వేల మంది జనాభాకు తాగునీరు అందిస్తున్నాం. నదిలో నీటి ప్రవాహం కారణంగా తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. బాగు చేసేందుకు అధిక నిధులు ఖర్చవుతున్నాయి.

–కరక అప్పలరాజు, ఉప సర్పంచ్, నాతవరం

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



నదిలో నీటి ప్రవాహం కారణంగా పైలట్ ప్రాజెక్టులో సాంకేతిక సమస్య ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు తాగునీరు అందిస్తున్నాం. తుపానుల సమయంలో నదిలో నీటి ఉధృతి పెరిగినప్పుడల్లా పైలట్ ప్రాజెక్టుకు ప్రమాదం లేకుండా ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేస్తాం. ఆయా పనులు చేసేందుకు రూ.4.50 లక్షల నిధులకు ప్రతిపాదనలు చేశాం.

–రాజేష్, జేఈ, ఆర్‌డబ్ల్యూస్, నాతవరం మండలం

ఐక్యంగా వినాయక ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



వేచలంలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఎ.కొత్తపల్లి వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ

దేవరాపల్లి : వినాయక నవరాత్రి మహోత్సవాలను గ్రామాల్లో ప్రజలంతా ఐక్యంగా నిర్వహించుకోవడం అభినందనీయమని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వేచలం శివారు యాదవుల కల్లాల్లో వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని వినాయక మండపం వద్ద సోమవారం నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. అన్నసమారాధనను వడ్డన చేసి ప్రారంభించారు. అంతకు ముందు వినాయకుడిని దర్శించుకొన్నారు. ఆయన వెంట సర్పంచ్ శతారినాయుడు, వేచలపు చిన్నంనాయుడు, రెడ్డి శేఖర్, బత్తి నాయుడు, సూరిబాబు, రెడ్డి శ్రీను, లెక్కల పరమేష్, దేముడుబాబు, వేచలపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లి, దేవరాపల్లిలో అన్నసమారాధనలు

ఎ. కొత్తపల్లి పంచాయతీ శివారు చిప్పడపాలెం, సంజీవపురం గ్రామాల్లో స్థానిక ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ పాల్గొన్నారు. అంతకుముందు వినాయకుడిని దర్శించుకొన్నారు. సాయంత్రం జరిగిన వినాయక నిమజ్జన మహోత్సవంలో పాల్గొన్నారు. దేవరాపల్లి సినియా థియేటర్ సమీపంలో సన్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు.

నిలకడగా తాండవ నీటిమట్టం

పంట పొలాలకు 450 క్యూసెక్కుల నీరు విడుదల



నిండుకుండలా తాండవ ప్రాజెక్టు

నాతవరం: మూడు రోజులుగా పంట కాలువలకు రోజుకు 450క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్న తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉందని ప్రాజెక్ట్ జేఈ రామకృష్ణ తెలిపారు. ఎగువ ప్రాంతం ఇన్‌ఫ్లో వల్ల పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నా ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గలేదన్నారు. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం 378.3 అడుగులు ఉందన్నారు. పంట కాలువలు ద్వారా వాయకట్టుకు విడుదల చేస్తున్న నీటికి ఇన్‌ఫ్లో నీరు సమానంగా ఉండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు సమానంగా ఉన్నాయన్నారు. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా 378 అడుగులు వచ్చేసరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేసి స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రమాద స్థాయి నీటి మట్టం ఉన్నా పంట పొలాలకు కాలువలు ద్వారా నీరు విడుదల చేయడంతో స్పిల్‌వే ద్వారా విడుదల చేయలేదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్‌క్లబ్ వారు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్య కోరల నుంచి ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలన్నారు. గ్రీన్‌క్లబ్‌లో సభ్యులైన ఉపాధ్యాయులంతా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని క్లబ్ వారు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి అబిద్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ కొనసాగింది. ఓజోన్ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆర్డీవో, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.గోపినాథ్ బహుమతులు అందజేశారు. ర్యాలీలో క్లబ్ ప్రతినిధులు ఎ.రమణమూర్తి, బి.అప్పారావు, బి.వి.నాయుడు, బంగారు అప్పలనాయుడు, ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్, అల్లు అప్పారావు, బాబీ మాస్టారు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో భారీ అన్న సమారాధన



భారీ సంఖ్యలో అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



ఇందిరమ్మ కాలనీలో వినాయకుని మండపం వద్ద చిన్నారుల కోలాటం



జంపెనలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట : కొండపాలెం, రోలుగుంట గ్రామాలకు జగనన్న కాలనీలో సోమవారం కాలనీవాసులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఇక్కడ రోలుగుంట, కొండపాలెం గ్రామాలకు చెందిన 78 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం (వైఎస్సార్‌సీపీ) పట్టాలిచ్చింది. లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులు సమకూర్చడంతో శరవేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. తొలి ఏడాది కావడంతో కాలనీవాసులందరూ ఆదిదేవుడు గణపతిని ప్రతిష్ఠించి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు కాలనీవాసుల సహకారంతో సోమవారం భారీగా అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో కుంచా వారి వీధితో పాటు ఇందిరమ్మ కాలనీలో వినాయకుని మండపాల వద్ద సోమవారం అన్నసమారాధన జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. ఇందిరమ్మ కాలనీలో వినాయక మండపం వద్ద చిన్నారులు వేసిన కోలాటం ఆకట్టుకుంది.

మాడుగుల : జంపెన గ్రామంలో సోమవారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తులు ఐకమత్యంతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడంతో పాటు సుమారు 2 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవం



నిమజ్జనం కోసం గణపతిని వాహనంపై ఊరేగిస్తూ తరలిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, గ్రామాల్లో ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. కె.జె.పురం, మాడుగుల, కింతలి, ఒమ్మలి, వీరవల్లి అగ్రహరం, తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను మేళాతాళాలతో ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. సోమవారం పలు గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద అన్నసమారాధన జరిపారు. కె.జె.పురం కల్లంపాకలు వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండల కేంద్రం అల్లువారి వీధిలో గణపతి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14న భారీ అన్నసమారాధన నిర్వహించారు. సోమవారం ఘనంగా స్వామిని ఊరేగించి నిమజ్జనోత్సవం జరిపారు. ఊరేగింపులో భజనలు, కోలాటంతో పాటు బాణసంచా వెలిగించి సందడి చేశారు. స్థానిక కోనేరులో స్వామివారిని నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు పెంపు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ–క్రాప్ నమోదు గడువును ఈ నెల 25 వ తేదీ వరకు పొడిగించినట్టు మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత ఈ నెల 15 వ తేదీ వరకు గడువు విధించగా, రాష్ట్రంలో వరదల కారణంగా గడువును మరో 10 రోజులు పొడిగించారన్నారు. ఈ–క్రాప్ నమోదు చేస్తేనే పంటల బీమా అమలు అవుతుందని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు పరిశుభ్రం



తీగమొక్కలను తొలగించిన తరువాత పరిశుభ్రంగా ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతం

సాక్షి ఎఫెక్ట్..

కె.కోటపాడు : డి.అగ్రహారంలో పాఠశాల సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగమొక్కలను ఎలక్ట్రికల్ సిబ్బంది తొలగించే చర్యలను సోమవారం చేపట్టారు. సాక్షిలో ఈ నెల 16న ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న నిర్లక్ష్యం పేరిట వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్, జూనియర్ లైన్‌మన్ కొయ్యి శ్రీను సోమవారం ఎలక్ట్రికల్ సిబ్బందితో తీగమొక్కలను తొలగించే చర్యలు తీసుకున్నారు.

కంటి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వద్దు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలిక్ ఆఫీసర్ భవాని

దేవరాపల్లి: కంటి ఆరోగ్య పట్ల అశ్రద్ధ చేయరాదని దేవరాపల్లి పీహెచ్‌సీ పారామెడికల్ ఆప్తమాలిక్ ఆఫీసర్ కె. భవాని అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో దేవరాపల్లి పీహెచ్‌సీ పరిధిలో 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో పలువురిని కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి, ప్రాంతీయ కంటి ఆసుపత్రికి తరలించారు.

మాడుగుల దసరా ఉత్సవాలకు సమావేశం

మాడుగుల : మహారాజుల పాలనలో మాడుగుల దసరాకు రాష్ట్రంలోనే మంచి పేరు ప్రఖ్యాతులుండేవి. గుర్రపు స్వారీ, కత్తి సాములు అంగరంగ వైభవంగా జరిగేవి. అదే సంప్రదాయంతో దసరా ఉత్సవాలు నిర్వహించడానికి శ్రీదుర్గాదేవి మోదమాంబ ఆటో యూనియన్ సంఘ సభ్యులు దేవీ ఆలయం వద్ద సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మాడుగులలో వచ్చే నెలలో దసరా ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. దేవీతల్లి విగ్రహానికి రంగులు అద్దడంతో పాటు ఆలయానికి రంగులు వేయడానికి దసరా ఉత్సవాలు నిర్వహించడానికి మోటారు యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మోదమాంబ ఆలయ కమిటీ మెంబరు దేవరాపల్లి శ్రీనివాసరావు, మోటారు యూనియన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

అక్టోబర్ 2 వరకూ కార్యక్రమాల నిర్వహణ



ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.కోటపాడు మండలంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. గ్రామ స్థాయిలో గల వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకోవడం ద్వారా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, పారిశుధ్యం నిర్వహణపై గ్రామసభ ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ద్వారానే స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చునని ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధలకు ఆహ్వానం అందించినట్టు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తితో సమాజంలో గుర్తింపు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్ : ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గుర్తింపు తెస్తుందని, అటు వంటి ఉపాధ్యాయుడు విద్యార్థులకు దిక్సూచి అని ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ముర్రు ముత్యాలునాయుడు అన్నారు. ఈ నెల 5 వ తేదీన జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అప్పలరాజుపురం హైస్కూలు ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు ఆదారి శ్రీనివాసరావుకు సోమవారం రాత్రి కె.జె.పురం కళావేదిక మీద అభినందన సభ ఏర్పాటు చేశారు. స్థానిక జనసేన నాయకుడు కాళ్ల హరిబాల కృష్ణ అధ్యక్షత వహించిన సభలో ముత్యాలునాయుడు మాట్లాడుతూ కె.జె.పురం గ్రామం విద్యకు పుట్టినిల్లు అని, అటువంటి గ్రామంలో పుట్టి పెరిగిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారని అన్నారు. శ్రీనివాసరావు వంటి ఆదర్శ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్యను అందించారన్నారు. అలాగే గ్రామంలో ఉచితంగా విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం ఆయన సేవా తత్పరతకు నిదర్శనమన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బి.అప్పారావు, కాళ్ల అమ్మతల్లినాయుడు, రాపేట రామకొండలరావు, కోడూరు కొండలరావుతో పాటు నాయకులు ఈశ్వరావు, రామూర్తి నాయుడు, నగేశ్‌బాబు, జోగినాయుడు, రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

అందని ద్రాక్షలా సీతాఫలాలు

- వారపు సంతలో ధరల పెరుగుదల



మాడుగుల వారపు సంతలో సీతాఫలాల అమ్మకాలు

మాడుగుల : ఆంధ్రా యాపిల్‌గా పేరు గాంచిన సీతాఫలాలకు ఈ ఏడాది గిరాకీ పెరిగింది. సోమవారం మాడుగుల వారపు సంతకు విశాఖ మన్యం దేవాపురం గ్రామం నుంచి మధురమైన సీతాఫలాలు ప్రతి సోమవారం వస్తాయి. ఇక్కడి సీతాఫలాలు మంచి రుచికరమైనవి కావడంతో దీనికి గిరాకీ పెరిగి ధరలు పెరిగాయి. 30 నుండి 35 సీతాఫలాలున్న గంప రూ. 350 నుంచి రూ.450 వరకు ధర పలుకుతుండడంతో సామాన్యులు వీటి రుచి చూడలేకపోతున్నారు. ఏజెన్సీలో కూడా ఈ పంట తగ్గిపోవడంతో ధరలు బాగా పెరిగిపోయాయని స్థానికులు చెబుతున్నారు.

వినాయకుని లడ్డూ వేలం



వేలం పాడిన రైతుకు లడ్డూను అందిస్తున్న నిర్వాహకులు

చీడికాడ : అర్జునగిరిలో మెయిన్‌రోడ్డులో సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాటలో లడ్డూను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ పాలసంఘం అధ్యక్షుడు కొవిలపల్లి పైడిబాబు దక్కించుకున్నారు. ఈ వినాయకునికి పీఏసీఎస్ కార్యదర్శి బత్తిన సత్యనారాయణ అందించిన 5 కిలోల లడ్డూను రూ.3200కు వేలం పాటలో పైడిబాబు దక్కించుకున్నారు. ఈ మేరకు పైడిబాబు మాట్లాడుతూ ఈ లడ్డూను రైతులకు అందించి వారికి సిద్ధి వినాయకుడు అండగా నిలవాలని కోరతానన్నారు.